సాక్షి పల్నాడు

మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025



రేపు విశ్వకర్మ యజ్ఞం

క్రోసూరు:గుంటూరుజిల్లా ఉద్దండరాయుని పాలెంలో బుధవారం విశ్వకర్మ యజ్ఞం జరుగుతుందని విశ్వకర్మ సంఘం ప్రతినిధి సిద్దు కామేశ్వరాచారి సోమవారం తెలిపారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 42,250 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 17,000 క్యూసెక్కులు వదులుతున్నారు.



నారీ–స్వశక్తి పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో బుధవారం నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు నిర్వహించే స్వస్థ్ నారీ–స్వశక్తి పరివార్ అభియాన్ పోస్టర్‌ను సోమవారం జేసీ సూరజ్‌గనోరే ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

ఎయిడ్స్ నియంత్రణ ప్రచార రథం ప్రారంభం



గుంటూరుమెడికల్: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ ప్రచార రథాన్ని సోమవారం గుంటూరు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ 15 రోజులపాటు జిల్లాలో ఈ ప్రచార రథం పర్యటిస్తుందన్నారు. ప్రజా సమూహాలు, మురికివాడలలో పర్యటిస్తూ ప్రజలకు హెచ్ఐవీ/ఎయిడ్స్, సుఖ వ్యాధులపై అవగాహన కల్పిస్తారన్నారు. మరింత సమాచారం కోసం 1097 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రోహిణీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం మేనేజర్ డాక్టర్ శాంసన్ పాల్గొన్నారు.

పీజీ రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో జూలైలో జరిగిన పీజీ కోర్సుల రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు సోమవారం విడుదల చేశారు. ఎంఎస్సీ స్టాటిస్టిక్స్‌లో 45 మందికి 44 మంది, ఎంఎస్సీ బయోకెమిస్ట్రీలో 24 మందికి 17మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. రీవాల్యుయేషన్‌కు ఈనెల 24వ తేదీ లోగా ఒక్కో పేపరుకు రూ.1860, పర్సనల్ వెరిఫికేషన్‌కు రూ.2190 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మానవత్వం చూపిన పోలీసులు



మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని హుస్సేన్ కట్ట వద్ద గత నాలుగు రోజులుగా మతి స్థిమితం లేని ఓ మహిళ తిరుగుతోంది. ఇది గమనించిన స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రవీంద్రనాయక్ తక్షణమే స్పందించి సోమవారం ఉదయం ఆ మహిళను మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విజయవాడ గిరిపురం అని తప్ప ఆమె ఇంకేమీ వివరాలు వెల్లడించలేక పోతోందని, ఆమె చెప్పిన ప్రాంతానికి పోలీస్ సిబ్బందిని పంపించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఏఎన్‌యులో ఘనంగా ఇంజినీర్స్ డే

పెదకాకాని(ఏఎన్‌యూ): భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్ వైఆర్ హరగోపాల్‌రెడ్డి సెమినార్ హాల్‌లో సోమవారం సివిల్ విభాగం ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే -2025 కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధర్‌రావు విచ్చేసి మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని తెలిపారు. విశిష్ట అతిథి రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ జి. బ్రహ్మయ్య మాట్లాడారు.

శ్రీవైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు



తెనాలి: పట్టణంలోని శ్రీ శరణాగతి గోష్ఠి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి మంగళాశాసనాలతో సోమవారం స్థానిక నాజరుపేటలోని లక్ష్మీనగర్‌లో శ్రీ వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ నిర్వాహకుడు నరేంద్ర రామానుజదాసస్వామి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు వేడుకలను ఆరంభించారు. 64 ప్రసాదాల నివేదన, తీర్థ ప్రసాదాల వితరణతో కార్యక్రమం ముగిసింది. నరేంద్ర రామానుజ దాసస్వామి కృష్ణాష్టమి, విశిష్టతను ప్రవచించారు. చావలి గ్రామభక్త బృందంచే భక్తి గీతాలు, కోలాటం, నృత్య గురువు నిర్మలా రమేష్ శిష్య బృందంచే కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు. ముద్దాభక్తుని రమణయ్య, చందు రామారావు, తన్నీరు సీతారామయ్య, ఈదర కోటేశ్వరరావు, రామానుజాచార్యులు పాల్గొన్నారు.

పాత్రికేయులను భయపెడుతున్నారు



వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడం జర్నలిస్టుల హక్కు. ఆ హక్కును కూటమి ప్రభుత్వం హరించడం దారుణం. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను, అక్రమాలను ఎత్తిచూపుతూ వార్తలు రాసినందుకే సాక్షి ఎడిటర్, సిబ్బందిపై కేసులు నమోదు చేయడం దుర్మార్గం. ప్రజల పక్షాన నిలబడే పత్రికలపై ప్రభుత్వం జులుం ప్రదర్శిస్తుంది. అడ్డగోలుగా కేసులు నమోదు చేస్తున్నారు. పత్రికలపై పెట్టిన కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలి. విలేకరులకు స్వేచ్ఛ ఇవ్వాలి. లేకుంటే భవిష్యత్తులో ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదం.

–ఎండీ ఫిరోజ్,
వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి



ప్రజాస్వామ్యం ఖూనీ



ప్రజలకు వాస్తవాలను తెలిపే పత్రికలపై కూటమి ప్రభుత్వం కేసులు పెట్టడం, దాడులు చేయడం, వేధించడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలు, అరాచకాలపై రాజకీయ నాయకులు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లు, ప్రసంగాలను ప్రచురించారనే ఆరోపణలతో పోలీసులు సాక్షి దినపత్రిక ఎడిటర్, సిబ్బందిపై కేసులు నమోదు చేయడం కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వారి లోపాలను ఎత్తిచూపే పత్రికలపై కేసులు పెట్టి వేధించడం దారుణం. ఈ పద్ధతి ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పత్రికలు నిర్వీర్యమైపోతాయి. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ విషయంలో పునరాలోచించుకోవాలి. ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలించాలి.

–చిల్లపల్లి మోహనరావు, ఆప్కో మాజీ చైర్మన్

తెల్ల బంగారంపైనే మక్కువ

- మిర్చికి ప్రత్యామ్నాయంగా పత్తి వైపు మళ్లిన రైతులు
- గతేడాది 1.43 లక్షల ఎకరాల్లో పత్తి సాగు
- ఈ ఏడాది ఇప్పటికే 1.83 లక్షల ఎకరాల్లో సాగు
- రెండేళ్లుగా పత్తి సాగుకు వెనకాడిన కర్షకులు
- పత్తికి రూ.8,110 మద్దతు ధరను ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

జిల్లాలో గతేడాది కన్నా పెరిగిన పత్తి సాగు



పిడుగురాళ్ల మండలంలో పత్తి సాగు

సాక్షి, నరసరావుపేట: తెల్ల బంగారంగా పిలిచే పత్తి సాగుపై పల్నాడు జిల్లా రైతులు మళ్లీ మక్కువ చూపుతున్నారు. పత్తి సాగుకు పల్నాడు పెట్టింది పేరు. జిల్లా రైతులు మిర్చి, పత్తి పంటలను అత్యధికంగా సాగు చేసేవారు. రెండు, మూడేళ్లుగా పత్తి , మిర్చి పంటలకు చీడపీడలు ఆశించి దిగుబడులు తగ్గాయి. గిట్టుబాటు ధరలు కూడా లేక తీవ్రంగా నష్టపోయారు. దీంతో పత్తి సాగుపై రైతులు వెనక్కి తగ్గారు. ఫలితంగా జిల్లాలో పత్తి సాగు భారీగా తగ్గింది. ప్రత్యామ్నాయంగా రైతులు మొక్కజొన్న, కంది పంటల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఒకానొక దశలో పల్నాడులో పత్తి సాగు చేసే వారు ఉంటారా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మారిన పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది పత్తి సాగు ఆశాజనకంగా పెరిగింది. ఆ పంటపై ఆధారపడి ఉన్న కూలీలు, పరిశ్రమలు, వ్యాపారులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

పెరిగిన పెట్టుబడి...తగ్గిన దిగుబడి

పత్తి పంట సాగుకు మిగిలిన పంటలతో పోల్చితే పెట్టుబడి ఎక్కువ. అయితే దిగుబడి, ధర మంచిగా ఉంటే అధిక లాభాలు వస్తాయన్న ఆశతో రైతులు అప్పులు చేసి మరీ ఖర్చు చేస్తారు. గతంతో పోల్చితే రైతులు అవసరం లేకపోయినా ఎరువులు, పిచికారి మందుల వాడకం అధికమైంది. దీంతో ఖర్చులు అధికమవుతున్నాయి. మరోవైపు రెండు, మూడేళ్లుగా పత్తి పంటకు గులాబీ రంగు పురుగు, ఇతర తెగుళ్ల సోకడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాక 2023, 2024 ఖరీఫ్‌లో సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో కొంతమంది రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లారు. ఎక్కువ మంది మిర్చి పంట సాగు చేయగా, మరికొందరు పొగాకు సాగు చేశారు. గతేడాది ఈ రెండు పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. మిర్చి ధరలు ఒక్కసారిగా పడిపోవడంతో పెట్టుబడి కాదు కదా కనీసం కూలీల ఖర్చుల కూడా రాని దుస్థితిని రైతులు ఎదుర్కొన్నారు. అధిక ధర వస్తుందని ఇప్పటికీ కొంతమంది రైతులు కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేసి ఉంచారు. మరోవైపు పొగాకు పరిమితికి మించి సాగు చేయడంతో కంపెనీలు, ప్రైవేట్ వ్యాపారాలు కొనలేమంటూ చేతులెత్తేశారు. కూటమి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారే తప్ప వారికి న్యాయం జరగలేదు. ఇటువంటి పరిస్థితులలో మళ్లీ సంప్రదాయ పత్తి సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

గతేడాది కన్నా 40 వేల ఎకరాలు అదనం

జిల్లాలో 2025 ఖరీఫ్‌లో పత్తి పంట సాధారణ సాగు 91,566 ఎకరాలుగా వ్యవసాయ శాఖ అధికారులు నిర్ణయించారు. జిల్లాలో గత గురువారం నాటికి 1,83,838 ఎకరాలలో పత్తి పంట సాగు చేశారు. ఇదే సమయానికి గతేడాది జిల్లాలో కేవలం 1,43,810 ఎకరాల్లో సాగు చేశారు. అంటే సుమారు 40 వేల ఎకరాల్లో అదనంగా ఈ ఏడాది పత్తి పంట సాగు చేశారు. పూర్తిస్థాయిలో ఈ క్రాప్ నమోదు చేస్తే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందని సమాచారం. పత్తికి కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.8,110 మద్దతు ధరగా ప్రకటించింది. ఇది గతేడాది ప్రకటించిన రూ.7,521 పోల్చితే ఇది రూ.589 అదనం.

పత్తి సాగు, కూలీల ఖర్చులు పెరిగాయి



ఈ ఏడాది పదెకరాల్లో పత్తి సాగు చేశాను. రసాయన ఎరువుల కొరత బాగా ఉంది. యూరియా దొరకడం లేదు. పత్తికి మద్దతు ధర రూ.8,110 ప్రకటించారు. కానీ దళారులు, వ్యాపారులు రూ.6,000 లోపే కొనుగోలు చేస్తున్నారు. సాగు, కూలీల ఖర్చులు ఎక్కువయ్యాయి. మద్దతు ధరకు కొనుగోలు చేస్తేనే పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది.

–పొన్నం శ్రీనివాసరావు,
పిన్నెల్లి, మాచవరం మండలం.

పత్తి సాగుకు అలవాటుపడ్డాం...



ఈ ఏడాది మూడు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. రెండేళ్ల కిందట పత్తి పంటతో రైతులు తీవ్ర నష్టాలు చవిచూశారు. దీంతో కొంత మంది పత్తి సాగుకు స్వస్తి పలికారు. అయితే మిగిలిన పంటలైన మిర్చి, పొగాకు పరిస్థితి అలాగే ఉండటంతో ఈ ఏడాది మళ్లీ పత్తి సాగు చేస్తున్నాం. పత్తి పంట సాగుకు అలవాటు పడ్డ నాలాంటి రైతులు మరో పంట వైపు అంత త్వరగా వెళ్లలేకపోతున్నాం.

–వెన్నా అంజిరెడ్డి,
కామేపల్లి, పిడుగురాళ్ల మండలం

సమస్యల పరిష్కారంలో అర్జీదారుని సంతృప్తే ధ్యేయం

పీజీఆర్ఎస్‌లో 151 అర్జీలు స్వీకరించిన జేసీ, అధికారులు



అర్జీలు స్వీకరించి సమస్య వింటున్న జేసీ సూరజ్, అధికారులు

నరసరావుపేట: అర్జీదారుని సంతృప్తి ధ్యేయంగా అర్జీలు రీ–ఓపెన్ కాకుండా పరిష్కారం తీరు వుండాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లా నలుమూలలు నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 151 అర్జీలు డీఆర్ఓ మురళి, పలువురు జిల్లా అధికారులతో కలిసి స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

జాషువా పల్నాడు జిల్లాగా నామకరణం చేయండి



వినుకొండ మండలం చాట్రగడ్డపాడు గ్రామంలో జన్మించిన మహాకవి గుర్రం జాషువా పేరు పల్నాడు జిల్లాకు పెట్టాలి. ఆయన పేరు పెట్టడం జిల్లాకే గర్వకారణం. ప్రజల మనోభావాలను గౌరవించి జాషువా పేరు పెట్టాలి.

–సీహెచ్.జాన్‌సుందరరావు, గుర్రం జాషువా పల్నాడు జిల్లా సాధన కమిటీ

పింఛన్ పునరుద్ధరించండి



పింఛన్ కోసం కొడుకు, కోడలుతో వచ్చిన సీతారావమ్మ

నాకు 95 ఏళ్లు, నాకు వచ్చే పింఛన్‌ను గతేడాది తొలగించారు. చిన్న కుమారుడు హైదరాబాదులో ఉంటుండగా అక్కడకు వెళ్లాను. వరుసగా మూడు నెలలపాటు పింఛన్ తీసుకోలేదు. ఆ తర్వాత వచ్చి పింఛన్ అడిగితే నీపేరు లేదని చెబుతున్నారు. గత ప్రభుత్వంలో నాకు ప్రతి నెలా పింఛన్ వస్తుండేది. నేను పెద్దకుమారుడి వద్ద ఉంటున్నా. వారు కూడా ఆర్థికంగా బలహీనులు. నాకు అదే జీవనాధారం.

–ఎస్.సీతారావమ్మ,
పిల్లుట్ల, మాచవరం మండలం

యూరియా కోసం పాట్లు



ముప్పాళ్లలోని గ్రోమోర్ గోదాము వద్ద క్యూలో ఉన్న రైతులు



క్రోసూరు సొసైటీ వద్దకు యూరియా కోసం వచ్చిన మహిళలు, రైతులు

ముప్పాళ్ల: రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. యూరియాకు కొరత లేదని, రైతులు అధైర్య పడొద్దని ప్రభుత్వం చెబుతున్నా..మరో పక్క రైతులు యూరియా కోసం పడిగాపులు పడుతూనే ఉన్నారు. ముప్పాళ్లలోని గ్రోమోర్ కేంద్రానికి సోమవారం 440 బ్యాగుల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు తెల్లవారుజాము నుంచే సత్తెనపల్లి–నరసరావుపేట ప్రధాన రహదారి పక్కనే ఉన్న గ్రోమోర్ కేంద్రం గోదాం వద్దకు చేరుకున్నారు. దుకాణం ఎప్పుడు తెరిస్తే అప్పుడు కట్టలు అందుతాయనే ఆశతో క్యూలైన్‌లో నిల్చున్నారు. క్రమంగా రైతులు సంఖ్య పెరగటంతో కేంద్రం వద్ద తోపులాట జరిగి ఉద్రిక్తత నెలకొంది. గ్రోమోర్ కేంద్రం నిర్వాహకులు వ్యవసాయశాఖ, పోలీసు అధికారులకు పరిస్థితిని వివరించారు. కేంద్రం వద్దకు చేరుకున్న పోలీసులు రైతుకు రెండు కట్టలు ఇచ్చేలా నిబంధన పెట్టారు. ఆ మేర రైతులకు టోకెన్‌లు అందించారు. ఒక్కో రైతుకు రెండు కట్టలు అందించి చేతులు దులుపుకున్నారు. ఆలస్యంగా వచ్చిన రైతులకు యూరియా అందకపోవటంతో దుకాణదారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాదనకు దిగారు.

తెల్లవారుజాము నుంచి పడిగాపులు

క్రోసూరులో తరలివచ్చిన మహిళలు

క్రోసూరు: యూరియా కోసం ఇప్పటి వరకు పురుష రైతులు మాత్రమే క్యూలైన్లలో బారులు తీరుతున్నారు. తాజాగా సోమవారం మహిళా రైతులు పెద్ద ఎత్తున క్రోసూరులోని సొసైటీ వద్ద బారులు తీరారు. క్రోసూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ పరిధిలోని ఐదు గ్రామాల రైతులకు అందించేందుకు 440 బస్తాల యూరియా సిద్ధం చేశారు. పాస్ పుస్తకానికి రెండు బస్తాల చొప్పున టోకెన్లు సిద్ధం చేశారు. రైతుల తాకిడి ఎక్కువగా ఉండడంతో ఒక బస్తా చొప్పున ఇచ్చేందుకు టోకెన్లు సిద్ధం చేస్తుండడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. కొందరికి రెండు బస్తాలిచ్చి మిగిలిన వారికి ఒక బస్తా ఎలా ఇస్తారంటూ సొసైటీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దీంతో టోకెన్‌కు రెండు బస్తాల చొప్పున యూరియా అందచేశారు. టోకెన్లు జారీ చేసినప్పటికీ 50 మంది రైతులకు యూరియా అందించలేకపోయారు. స్టాక్ వచ్చిన వెంటనే ఇచ్చేందుకు టోకెన్ తీసుకున్న రైతుల పేర్లు రికార్డులో నమోదు చేసుకున్నట్లు సొసైటీ కార్యదర్శి నాగేశ్వరరావు వివరించారు.

బార్‌ల దరఖాస్తుకు స్పందన నిల్

- జిల్లాలో 30 బార్ లైసెన్స్‌లకు రీనోటిఫికేషన్
- దరఖాస్తులకు 14వ తేదీ చివరి గడువు
- వ్యాపారుల నుంచి స్పందన లేక 17 వరకు పొడిగింపు
- అధికారులకు తలనొప్పిగా మారిన బార్ లైసెన్స్‌ల వ్యవహారం
- ఎన్ని ప్రయత్నాలు చేసినా ముందుకు రాని వ్యాపారులు



నరసరావుపేటటౌన్: బార్ అండ్ రెస్టారెంట్ లైసెన్స్‌ల వ్యవహారం అధికారులకు తలనొప్పిగా మారింది. బార్ లైసెన్స్ నిర్వాహణకు మొదట ప్రభుత్వం రెండుసార్లు అవకాశం ఇచ్చింది. రెండోసారి పిలిచిన రీనోటిఫికేషన్‌కు స్పందన లేకపోవటంతో గడువును మరోమారు పెంచింది. కూటమికి చెందిన మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ఇతరులు ఎవరూ దరఖాస్తు చేయకుండా బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో ఆ పార్టీ నాయకులు మినహా ఆసక్తిగల వారెవరూ దరఖాస్తు చేయటానికి సాహసించలేదు. తొలి విడత రెండుసార్లు అవకాశం ఇవ్వగా 40 శాతం దుకాణాలకు మాత్రమే దరఖాస్తులు అందాయి. దీంతో రెండోవిడత ఈ నెల 3వ తేదీన తిరిగి ప్రభుత్వం రీనోటిఫికేషన్ ఇచ్చింది.

18న లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు

పల్నాడు జిల్లాలో ఓపెన్ క్యాటగిరీ 49, గీత కులాలకు సంబంధించి 5, మొత్తం 54 బార్ అండ్ రెస్టారెంట్‌లకు తొలివిడత నోటిఫికేషన్ జారీ చేశారు. అందులో 19 బార్ అండ్ రెస్టారెంట్‌లకు మాత్రమే నిర్వాహకులు ముందుకు రాగా మిగిలిన 30 బార్‌లకు ప్రభుత్వం తిరిగి గెజిట్ విడుదల చేసింది. నరసరావుపేటలో 8, చిలకలూరిపేటలో 7, పిడుగురాళ్లలో 6, మాచర్లలో 3, వినుకొండలో 6 బార్‌లకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీగా ప్రకటించింది. ఆశించిన మేర దరఖాస్తులు అందకపోవటంతో గడువును 17వ తేదీ వరకు పొడిగించారు. 18వ తేదీన కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిన దుకాణాలు కేటాయిస్తారు. ఒక్కో బార్‌కు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 4 దరఖాస్తులు అందితేనే లాటరీ ప్రక్రియ ముందుకు సాగుతుంది. 30 బార్ అండ్ రెస్టారెంట్‌లకు సుమారు 120 పైగా దరఖాస్తులు అందాల్సి ఉంది. ఇప్పటి వరకు 8 దరఖాస్తులు మాత్రమే అందాయి.

కలెక్టర్ల సదస్సులో కృతికా శుక్లా



నరసరావుపేట: అమరావతిలోని సచివాలయంలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన కలెక్టర్ల సదస్సుకు పల్నాడు జిల్లా నూతన కలెక్టర్ కృతికా శుక్లా హాజరయ్యారు.

డీఈవో సైట్‌లో డీఎస్సీ- 2025 ఎంపిక జాబితా

గుంటూరుఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాలో డీఎస్సీ–2025 ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన అన్ని కేటగిరీల వారీగా ఎంపిక జాబితాను డీఈవోజీఎన్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు జాబితాను పరిశీలించుకోవాలని సూచించారు. అదే విధంగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంతో పాటు జిల్లా కలెక్టరేట్‌లోని డిస్‌ప్లే బోర్డులలో జాబితాను ఉంచామని, అదనపు సమాచారం కోసం డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు ఎస్సీ సెల్ కార్యనిర్వాహక సమావేశం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్ బాబు



సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కార్యనిర్వాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు పిలుపునిచ్చారు. నరసరావుపేట పెదచెరువులోని కాసు ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పెద్దలు, రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ, గ్రామ ఎస్సీ సెల్ కార్యవర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అన్ని నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిలు, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు, ముఖ్యమైన ఎస్సీ సామాజికవర్గ నేతలు పాల్గొంటారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఎస్సీ సామాజిక వర్గానికి జరిగిన మేలును గుర్తు చేసుకుంటూనే, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిద్దామన్నారు. కొన్ని ముఖ్యమైన నిర్ణయాలను సమావేశంలో ఆమోదిస్తామన్నారు.

సమావేశం జయప్రదం చేయండి

నరసరావుపేట: పట్టణంలోని పెద్దచెరువు బైపాస్ రోడ్డులో గల కాసు కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం నిర్వహించే వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా కార్యనిర్వాహక సమావేశం జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. మాచర్ల, వినుకొండ, చిలకలూరిపేట, పెదకూరపాడు, గురజాల, సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాలలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం: రూ.2,200 గరిష్టం: రూ.2,800

మోడల్ ధర రూ.2,500

పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 353

కొమ్ములు : 179 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట:	గరిష్ట:	మోడల్:
9,350	10,225	10,000

కాయలు : 174 బస్తాలు

కనిష్ట:	గరిష్ట:	మోడల్:
9,350	10,561	10,000

మొత్తం అమ్మకాలు : 264.75 క్వింటాళ్లు

-దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	33,865
అమ్మకాలు	31,395
నిల్వ	8,678



నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-14,300
నంబరు-5	10,000-13,400
273	10,500-13,500
341	10,000-15,000
4884	10,000-14,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-14,200
నంబరు-5	10,000-13,500
341	11,000-15,800

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,000
బాడిగ-355	10,000 - 16,000
దేవనూరు డీలక్స్	10,500 - 13,800
ఆర్మూర్	9,800 - 12,500
తాలుకాయలు	6,200 - 7,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-15,000
బాడిగ - 355	10,000-15,700
దేవనూరు డీలక్స్	10,500-14,500
తాలు	5,200 - 7,200

-కొరిటెపాడు (గుంటూరు)

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- ఎస్పీ కృష్ణారావు
- జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

నరసరావుపేట రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ, ఆర్థిక, ఆస్తి వివాదాలు, మోసం వంటి 127 ఫిర్యాదులు అందాయి. అదనపు ఎస్పీ(అడ్మిన్) జేవీ సంతోష్, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఎం.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులో బంగారం బయటకు తీశారు..

పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంక్‌లో 76.80 గ్రాముల బంగారం పెట్టి రూ.1.90 లక్షలు రుణం తీసుకున్నా. నెల క్రితం డబ్బులు చెల్లించి బంగారాన్ని తీసుకునేందుకు వెళ్లా. బ్యాంక్‌కు వెళ్లగా బంగారం తీసినట్టుగా ఉంది. దీనిపై మేనేజర్‌ను ప్రశ్నించగా లెడ్జర్ బుక్ తెప్పించి పరిశీలించగా సంతకం తనది కాదని తేలింది. దీనిపై మేనేజర్‌ను పలు మార్లు కోరినా పట్టించుకోవడం లేదు. నాకు న్యాయం చేయాలి.

– షేక్ కరీమున్, చిలకలూరిపేట

నాకు తెలియకుండా అప్పు..

ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు గండు రవితేజ. ఇండస్‌ల్యాండ్ బ్యాంక్ మేనేజర్ బ్యాంక్ వివరాలు, ఓటీపీ, ఆధార్, ఫాన్ సర్టిఫికెట్లు, సంతకాలు తీసుకున్నారు. నాకు తెలియకుండానే నా పేరుతో రూ.10 లక్షలు లోన్ తీసుకున్నారు. లోన్ యాప్ నిర్వాహకులు తరచూ ఫోన్ చేసి వేధిస్తున్నారు. రవితేజతో పాటు బ్యాంక్ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి.

–ఈదర త్రివేణి, బట్లూరు, సత్తెనపల్లి మండలం

మిర్చి వ్యాపారి మోసం చేశాడు

గుంటూరులోని నవతా చిల్లీస్ వ్యాపారి వద్ద 2021లో మిర్చిని విక్రయించా. నగదును అదే షాపులో వడ్డీకి దాచుకున్నా. 20 ఏళ్ల నుంచి వ్యాపారులలో పరిచయం ఏర్పడింది. రెండు ఎకరాలు విక్రయించగా వచ్చిన నగదుతో కలిపి మొత్తం రూ.24 లక్షలు వడ్డీకి ఇచ్చా. వ్యాపార భాగస్వాముల్లో ఒకరైన కోవిడి శ్రీనివాసరావు మృతి చెందగా రెండో భాగస్వామి గోల్లమూడి శ్రీనివాసరావు దాచుకున్న డబ్బుకు ఇబ్బందేమి లేదని, సంస్థ పేరుతో ఆస్తులు ఉన్నాయని వాటిని అమ్మి అప్పు చెల్లిస్తామని భరోసా ఇచ్చాడు. శ్రీనివాసరావు ఇప్పుడు మాటమార్చి డబ్బులతో తనకు సంబంధం లేదని, షాపు దగ్గరకు వస్తే చంపుతామని బెదిరిస్తున్నాడు.

–భవిరిశెట్టి సత్యనారాయణ, పిన్నెల్లి, మాచవరం మండలం

కలెక్టర్ ఆదేశించినా పోలీసులు స్పందించడం లేదు

క్రోసూరులోని ఎస్సీ కాంప్లెక్స్‌లో 5వ నంబరు షాపు ను చిలకా కిశోర్‌బాబుకు 1998లో కేటాయించా రు. 2020లో చనిపోవడంతో కుమార్తె అయినా నేను షాపు నడుపుకుంటున్నా. షాపునకు మరమ్మత్తులు నిర్వహించేందుకు ఖాళీగా ఉంచిన సమయంలో దుద్దుల ము రళీ అనే అతను షాపును అక్రమించాడు. దీనిపై పలు మార్లు కలెక్టర్‌కు ఫిర్యా దు చేయడంతో షాపు అప్పగించాలని కలెక్టర్ పోలీసులను ఆదేశించారు. అయినా పోలీసులు స్పందించడం లేదని బాధితురాలు ఫిర్యాదు చేసింది.

–చిలకా హనీగ్లాడెన్, క్రోసూరు

సీజ్ చేసిన వాహనాలను ఇప్పిస్తానని మోసం

నకరికల్లు మండలం చల్లగుండ్లకు చెందిన ఉప్పుతోళ్ల వెంకటేశ్వర్లు వాహనాల క్రయవిక్రయదారుడని నమ్మించాడు. ప్రభుత్వం సీజ్ చేసిన వాహనాలు కొనుగోలు డీలర్‌నని చెప్పాడు. కారు, ద్విచక్రవాహనం ఇప్పిస్తానని నమ్మించి రూ.3.22 లక్షలు తీసుకున్నాడు. కారు, బైక్ ఇప్పించకపోగా డబ్బులు అడిగితే అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడు.

–నిట్టూరి ప్రసాద్, ఫొటోగ్రాఫర్ నెమలిపురం

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోలేదు

భూ వివాదం నేపథ్యంలో నరసరావుపేటకు చెందిన కె.సురేష్, బండారు చంద్రశేఖర్, శ్రీనివాసరావు మధ్య విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చంద్రశేఖర్, శ్రీనివాసరావు నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేశాను. పోలీసులు స్పందించి వీరిని బైండోవర్ చేశారు. ఈ ఏడాది మార్చి 27వ తేదీన వల్లప్పచెరువు వద్ద దాడి చేశారు. ఈ ఘటనలో చంద్రశేఖర్, శ్రీనివాసరావుపై పోలీసులకు ఫిర్యాదు చేశా. అయినా పోలీసులు ఇప్పటి వరకు వారిపై చర్యలు తీసుకోలేదు. స్పందించి దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని కోరుతున్నా.

– కుంచాల సురేష్, బాధితుడు

పీఆర్సీ కమిషన్ వేయకపోవడం మోసగించటమే

- ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు
- సత్తెనపల్లిలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన ప్రదర్శన



ఉపాధ్యాయుల నిరసన ప్రదర్శన

సత్తెనపల్లి: ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు 2023 జూలై నుంచి 12వ పీఆర్సీ వర్తింపజేయాల్సి ఉండగా సమయం దాటి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇంత వరకు పీఆర్సీ కమిషన్‌ను నియమించకపోవడం ఉద్యోగులను మోసగించటమేనని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలు పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు నిరసన వారం 5వ రోజు కార్యాచరణలో భాగంగా సత్తెనపల్లి మండల పరిషత్ కార్యాలయం నుండి సోమవారం ర్యాలీగా వెళ్లి తాలూకా కేంద్రం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనకు ఏపీటీఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ మొహమ్మద్ ఇబ్రహీం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంటనే పీఆర్సీ కమిషన్ నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఉద్యోగుల సొమ్ము 10 శాతాన్ని పెట్టుబడి దారులకు దోచిపెట్టే కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీము రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. మెమో నంబర్ 57 ప్రకారం 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ వర్తింపజేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించుకుంటే కలిసొచ్చే సంఘాలతో పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు బాళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే విడుదల చేయాలని, బోధనేతర యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం మాట్లాడుతూ హెల్త్ ప్రీమియం చెల్లిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, పరీక్షలలో అసెస్మెంట్ బుక్‌లెట్ విధానం వలన ఉపాధ్యాయుల బోధన సమయం హరించడమే కాకుండా పిల్లలకు ఏమాత్రం ఉపయోగం లేదని చెప్పారు. అసెస్మెంట్ బుక్ లెట్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్ లో ఉన్న అన్ని రకాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాలూకా పరిధిలోని మండలాల ఏపీటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు శివారెడ్డి, ఫిరోజ్ ఖాన్, . దర్మారావు, ఐతమ్‌రాజు,రవి కుమార్, శ్రీధర్, సుభాని, సాబీర్, చంద్రం,రమేష్, రామకృష్ణ, హఫీస్, కోటేశ్వరరావు, సునీల్, వెంకటేశ్వరరావు వినోద్, సమద్ ఖాన్, నాసరయ్య, సుబ్బారెడ్డి, ఇలియాస్, శేషగిరి, అత్తరున్నీసా, లెనిన్‌రాణి, శ్రీదేవి, తులసి, కుదిషియా పాల్గొన్నారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపికలు

సత్తెనపల్లి: అండర్-19 స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపికల తేదీల షెడ్యూల్‌ను ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు సోమవారం విడుదల చేశారు. ఈ నెల 17న ఖాజీపాలెంలోని డాక్టర్ బీఎస్ఆర్‌ఏరాజు జూనియర్ కాలేజీలో అథ్లెటిక్స్, సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫుట్‌బాల్, సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఈ నెల 18న మేడికొండూరు మండలం కొర్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫెన్సింగ్, గుంటూరు బీఆర్ స్టేడియంలో టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 19న చిలకలూరిపేట ఏఎంజీ జూనియర్ కళాశాలలో కరాటే జట్ల ఎంపికలు, అచ్చంపేట ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కాలేజీలో రెజ్లింగ్, గ్రెకో రోమన్ జట్ల ఎంపికలు జరుగుతాయన్నారు. ఈ నెల 20న గుంటూరు బీఆర్ స్టేడియంలో టేబుల్‌టెన్నిస్ జట్ల ఎంపికలు, ఈ నెల 22న గుంటూరు రూరల్ మండలం గోరంట్లలోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్విమ్మింగ్ అండ్ డైవింగ్ వాటర్ పోలో, మోడరన్ పెంటాథలన్ జిల్లా జట్ల ఎంపికలు జరుగుతాయని వెల్లడించారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 2007 జనవరి ఒకటి తర్వాత జన్మించిన వారు అయి ఉండాలన్నారు.

ఈనెల 20న నిరుద్యోగులకు జాబ్ మేళా

మాచర్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మాచర్ల ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ పల్నాడు జిల్లా అధికారి తమ్మాజీరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాకు సుమారు పది కంపెనీలు హాజరవుతాయని చెప్పారు. అందులో మాస్టర్ మైండ్స్, ఆదిత్య ఆర్గానిక్ ఎకో టెక్నాలజీ, కపిస్టన్ సర్వీసెస్, గోదావరి ఆంధ్ర కోఆపరేటివ్ క్రెడిట్ అండ్ క్రెడిట్ సొసైటీ, ఎంఆర్ఎఫ్ టైర్స్, ఇన్నోవే సోర్స్, టీవీఎస్ బ్యాటరీ, టాటా ఎలక్ట్రానిక్స్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, స్కిల్ క్రాఫ్ట్ వంటి పలు రకాల కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని వివరించారు. విద్యార్హతను బట్టి సుమారు రూ.15 వేలు నుంచి రూ.35 వేల వరకు జీతం ఉంటుందని చెప్పారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొ మో, ఫార్మసీ, పీజీ అర్హతలు ఉండి, 18–35 వయస్సు గల నిరుద్యోగ యువతి యువకులు బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్ పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. మాచర్ల పట్టణంలోని ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేళా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వివరాలకు ఆర్.కిరణ్ నాయక్ 7842747682, శ్రీకాంత్ 9492158153 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రేపు వారధి వార్షిక పోటీలు

దీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజి ల్లా స్థాయి వారధి వార్షిక పోటీలు బుధవారం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో వ్యాసరచన, వక్తృత్వం అంశాలలో పోటీలు ఉంటాయని చెప్పారు. వ్యాసరచనలో విద్యార్థుల మానసిక ఆరోగ్యం పెరుగుదలపై పాఠశాలల పాత్ర లేదా భారతదేశ పరిస్థితుల దృష్ట్యా ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన మూడు ముఖ్యమైన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అనే అంశాలపై పోటీ ఉంటుందని వివరించారు. వక్తృత్వంలో విద్యార్థుల అభ్యాసన పెంపుదలపై సామాజిక మాధ్యమాల పాత్ర లేదా భారతదేశ అభివృద్ధికి సంబంధించి ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అంశంపై పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనేందుకు 8, 9, 10వ తరగతి చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మాత్రమే అర్హులని వివరించారు. పోటీ ఇంగ్లిష్ మాధ్యమంలో మాత్రమే జరుగుతుందని స్పష్టం చేశారు. మండల స్థాయి పోటీలో ప్రథమ స్థానం సాధించిన టీమ్‌లను జిల్లా స్థాయికి పంపాలని తెలిపారు. జిల్లాస్థాయి విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

మెడికల్ కళాశాలలను అమ్ముకుంటున్నారు..

- రూ.200 కోట్లు వసూలుకు పన్నాగం
- సీటు రూ.50 లక్షలకు అమ్ముకునేలా ప్రైవేటు వ్యక్తులకు అవకాశం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే మెడికల్ కళాశాలల స్వాధీనం
- గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి



దాచేపల్లి: చంద్రబాబు ప్రభుత్వం లంచాలకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను అమ్ముకుంటుందని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ఎవరైతే లంచాలు ఇచ్చి మెడికల్ కాలేజీలను లీజుకు తీసుకున్నారో.. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరిగి వాటిని స్వాధీనం చేసుకుంటామని ఆయన హెచ్చరించారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అయిన వెంటనే కాలేజీలను ప్రభుత్వం ద్వారానే నడిపించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సంపద సృష్టిస్తానని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రూ.8 వేల కోట్లు విలువ చేసే 17 మెడికల్ కాలేజీలను తన చెంచాలకు అప్పగిస్తున్నాడని, దీనిపై తప్పనిసరిగా సీబీఐ, ఈడీ విచారణ ఉంటుందని మహేష్ రెడ్డి హెచ్చరించారు. తమ ఐదేళ్ల పాలనలో రెండేళ్లు కోవిడ్ పోతే మిగిలిన మూడు సంవత్సరాల్లో నాలుగైదు కాలేజీలు పూర్తి కాగా మరి కొన్ని కాలేజీలు 60 నుంచి 80 శాతం వరకు నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయని వివరించారు.

పిడుగురాళ్ల కాలేజీ 60 శాతం పూర్తి...

పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ 60 శాతం పూర్తి కాగా హాస్పిటల్ 90 శాతం పూర్తి అయిందని ఆయన చెప్పారు. 1923 నుంచి 2019 వరకు 96 సంవత్సరాలలో ఆంధ్ర రాష్ట్రంలో కేవలం 12 ప్రభుత్వం మెడికల్ కాలేజ్ ఉంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయిన తరువాత 17 మెడికల్ కళాశాలను నెలకొల్పారని ఆయన అన్నారు. మీకు చేతనైతే పూర్తి చేసి కళాశాలలను నడిపించాలని సవాల్ విసిరారు. ఒక్కొక్క మెడికల్ సీటు రూ.30 నుంచి 40 లక్షలకు అమ్ముకునేదానికి ఆ కాలేజీ ఎవరికైతే ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్నారో వారికి అనుమతులు ఇస్తున్నట్లుగా మీడియాలో కథనలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుమారుగా ఐదేళ్లలో రూ.20 నుంచి రూ.30 వేల కోట్లు సంపదను సృష్టిస్తూ పోతే దాన్ని ఈరోజు అప్పనంగా అమ్ముకుంటున్నారని మహేష్ రెడ్డి ధ్వజ మెత్తారు.

టీడీపీ నాయకులకు మెదడు పనిచేయడం లేదు..

ఎక్కడో అమరావతిలోనో..గుంటూరులో ఏసీ రూములో కూర్చుని విమర్శలు చేసే తెలుగుదేశం నాయకులకు తాను ఛాలెంజ్ విసురుతున్నాని, టీడీపీ నాయకులకు దమ్ముంటే గురజాల గల్లీకి రావాలని, పిడుగురాళ్లలో ఉన్న కాలేజీ ఎలా పూర్తి చేశామో చూపిస్తామన్నారు. ఇప్పుడెందుకు మెడికల్ కళాశాలలను అమ్ముకుంటున్నారో ప్రజలందరికి తెలుసని, నిర్మాణం పూర్తి చేసుకున్న పులివెందుల మెడికల్ కళాశాలలో సీట్లు కేటాయిస్తామని చెబితే చంద్రబాబు ప్రభుత్వం సీట్లు కేటాయించవద్దని లేఖ రాయటం వాస్తవం కాదా అని మహేష్ రెడ్డి ప్రశ్నించారు. రూ 500 కోట్ల విలువ చేసే ఒక్కో కాలేజీని కేవలం రూ.50 కోట్లకు అమ్ముకొని మరో రూ.200 కోట్లు లంచాలు తీసుకునేందుకే చంద్రబాబు ప్రభుత్వం కుట్ర చేస్తుందని మహేష్ రెడ్డి మండిపడ్డారు. టీడీపీ నాయకులకు మెదడు సరిగ్గా పనిచేయటం లేదని, తెలుగుదేశం నాయకులు చేసే చౌకబారు విమర్శలకు మేము స్పందించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో భాగస్వామిగా ఉన్న టీడీపీ నాయకులు కొత్తగా మంజూరైన 17 మెడికల్ కాలేజీలకు ఒక్కో దానికి రూ.200 కోట్లు కూడా తీసుకురాలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఈ నిధులు తెస్తే అన్ని కళాశాల నిర్మాణాలు పూర్తి అవుతాయని మహేష్ రెడ్డి పేర్కొన్నారు. రూ.లక్షల కోట్ల అప్పు చేసి అమరావతిలో పెడుతున్నప్పుడు రూ.3 వేల కోట్లు అప్పుచేసి విద్య, వైద్యానికి ఎందుకు పెట్టారని ఆయన ప్రశ్నించారు. వెనుకబడిన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ మెడికల్ కళాశాలల నిర్మాణాలు కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తే ఆ ప్రాంతాలలోని నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి అన్నారు. మెడికల్ కళాశాల మంజూరులో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలకు ఎటువంటి సంబంధం లేదని, గత ప్రభుత్వంలో జవహర్ రెడ్డి పట్టు పట్టి ఈ కళాశాలను మంజూరు చేయించారని మహేష్ రెడ్డి గుర్తు చేశారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిరస్మరణీయుడు

సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్ట్ జీఎం శ్రీనివాసులు



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సత్రశాల(రెంటచింతల): ఇంజినీరింగ్ రంగంలో అసాధారణ ప్రతిభతో అత్యున్నత శిఖరాలను అధిరోహించి మన దేశ ఖ్యాతిని చాటిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారత జాతి గర్వించదగ్గ ముద్దుబిడ్డ అని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్ట్ జీఎం శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం విశ్వేశ్వరయ్య జయంతి నిర్వహించారు. ప్రాజెక్ట్ ఆవరణలోని విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతు విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా దేశ వ్యాప్తంగా ఇంజినీర్స్ డేను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. జలాశయాల నిర్మాతగా, ఆర్థికవేత్తగా శాశ్వత కీర్తి గడించిన విశ్వేశ్వరయ్యను భారత ప్రభుత్వం 1955లో భారత రత్న పురస్కారంతోను, బ్రిటీష్ ప్రభుత్వం అత్యుత్తమ పౌర పురస్కారమైన బ్రిటీష్ నైట్‌హుడ్‌గా సన్మానించిందన్నారు. మైసూర్ ఆదర్శ నగరంగా మారడంలో ఆయన యనలేదినని కొనియాడారు. హైదరాబాద్, ముంబాయి నగరాలకు డ్రెయినేజీ వ్యవస్థ రూపకల్పన, విశాఖపట్నం పోర్టు ఏర్పాటులో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఈఈ సుబ్రహ్మణ్యం, డెప్యూటీ ఈఈలు జయశంకర్, గిరిబాబు, మహమ్మద్ మతిన్, ఏఈలు వెంకటరమణ, మల్లేష్, ఏఈఈ శ్రీలత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

తాడేపల్లి రూరల్ : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే బాలబాలికల జట్లను సోమవారం తాడేపల్లి గుడ్ న్యూస్ స్కూలులో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కె. మహేష్, కార్యదర్శి అజయ్ మాట్లాడుతూ 51వ జూనియర్, బాయ్స్ గరల్స్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఈనెల 25న కృష్ణాజిల్లా గొల్లపూడిలో జరుగనున్నాయని తెలిపారు. ఈ పోటీలకు గుంటూరు జిల్లా నుంచి బాలికల టీమ్‌లో 15 మంది, బాలుర టీమ్‌లో 15 మందిని ఎంపిక చేశామని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు వచ్చినట్లు తెలిపారు. సెలక్షన్ కమిటీలో సుబ్బారాజు, అర్జున్, రాష్ట్ర వ్యాయామ అధ్యక్షులు కరిముల్లా చౌదరి, ఆరోగ్యదాసు, నూతక్కి రవి, రమేష్‌బాబు, మెల్లెంపూడి రవి, హరికృష్ణ, రాంబాబు, సాంబశివరావు, రజనీ నాయక్ ఉన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గుంటూరు జిల్లాలో వర్షపాతం వివరాలు

- గుంటూరు పశ్చిమలో 125.2 మిల్లీమీటర్ల వర్షం
- నగటున 31.5 మి.మీ. వర్షపాతం నమోదు

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. గుంటూరు నగరంలో ఆదివారం సాయంత్రం సుమారు రెండు గంటల పాటు ఎడతెరిపిలేని భారీ వర్షం కురిసింది. జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా గుంటూరు పశ్చిమలో 125.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా ఫిరంగిపురం మండలంలో 6.4 మి.మీ వర్షం పడింది. సగటున 31.5 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు తూర్పులో 88.2 మి.మీ., పెదకాకాని 54.2, కాకుమాను 54, దుగ్గిరాల 45.6, మంగళగిరి 43, కొల్లిపర 38.4, తాడికొండ 26.6, పెదనందిపాడు 26.4, తాడేపల్లి 17.6, మేడికొండూరు 16.8, చేబ్రోలు 9.2, తుళ్ళూరు 8.4, ప్రత్తిపాడు మండలంలో 7.6 మి.మీ చొప్పున వర్షం పడింది. ఈ నెల 15వ తేదీ నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 79.7 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 137.3 మి.మీ వర్షపాతం నమోదైంది.

గంజాయి విక్రేత అరెస్టు

మంగళగిరి టౌన్ : గంజాయి కలిగిఉన్న ఓ యువకుడ్ని మంగళగిరి పట్టణ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి పట్టణ పరిధిలోని కొప్పురావు కాలనీలో నివాసముంటున్న మణికంఠ అనే యువకుడు గత కొంత కాలంగా పట్టణ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల్లో నివాసముంటున్నాడు. గంజాయి విక్రేతలపై పట్టణ పోలీసులపై నిఘా ఉంచారు. ఇందులో భాగంగా మణికంఠ వద్ద గంజాయి ఉందన్న సమాచారంతో పట్టణ సీఐ వీరాస్వామి సిబ్బందితో అతడి ఇంటిపై దాడి చేశారు. అదే సమయానికి గంజాయి పొట్లాలను కడుతూ ఉన్నాడు. అతడిని పట్టుకుని, ఇంటిని సోదా చేశారు. సుమారు 1500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఒక యువకుడి వద్దే ఇంత మొత్తంలో గంజాయి దొరకడంతో ఎక్కడ నుంచి వస్తోందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మణికంఠ కొంతకాలంగా గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారం ఉండడంతో అతనిపై నిఘా ఉంచామని పేర్కొన్నారు.

చింతలపూడిలో జాతీయ మీడియా ప్రతినిధుల పర్యటన



స్వామిత్వ రాష్ట్ర డైరెక్టరు నిశాంత్ రెడ్డి

దుగ్గిరాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వామిత్వ పథకం అమలు, పనితీరు పరిశీలనకు జాతీయ మీడియా ప్రతినిధులు, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు సోమవారం దుగ్గిరాల మండలం చింతలపూడిలో పర్యటించారు. ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వామిత్వ రాష్ట్ర డైరెక్టర్ ఎ.నిశాంత్ రెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా స్వామిత్వ సర్వే చేసిన విధానం వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న స్వామిత్వ రీ సర్వే గురించి, గ్రామ సభ విధులు నియమావళి వివరించారు. సర్వే మూడు దశల్లో ఉంటుందని, మార్చి 2026 నాటికి రాష్ట్రంలో పూర్తవుతుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టరు మహేష్ కుమార్, పంచాయతీరాజ్ ఎండీ చందన, డీపీవో సాయి కుమార్, డీఎల్‌పీఓ స్వరూపారాణి, ఇన్‌చార్జి ఎంపీడీఓ వి.చంద్రమోహన్, డెప్యూటీ ఎంపీడీఓ కె.జె.నెహ్రూ, గ్రామ సర్పంచి టి.రామకృష్ణ, ఈఓ మణికంఠ, బృంద సభ్యులు పాల్గొన్నారు.